పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పెదబయలు : స్థానిక గిరిజన బాలుర రెసిడెన్సీ యల్ పాఠశాలను శుక్రవారం ఉదయం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం సందర్శించారు. ఉపాధ్యాయుల పనితీరును అడిగి తెలుసు కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎమ్మెల్యే అయ్యాక విద్యార్థుల చదువు, ఆరోగ్యం పట్ల అధికంగా దృష్టి సారిస్తున్నా నన్నారు. విద్యార్థులకు ప్రాథమిక దశనుండే బాగా రాయడం, చదవడం అలవాటు చేయాలన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గర్జించిన గిరిజనులు

- -షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగ నియామక చట్టం చేయాలని డిమాండ్
- -లేనిపక్షంలో చలో అసెంబ్లీ, మన్యం బంద్ నిర్వహిస్తామని హెచ్చరిక
- -పాడేరులో భారీ ర్యాలీ - ఐటిడిఎ ఎదుట బైఠాయింపు

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బాలదేవ్

ఐటిడిఎ ఎదుట బైఠాయించిన ఆదివాసీ యువత, విద్యార్థులు

ప్రజాశక్తి - పాడేరు : తక్షణం షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగ నియామక చట్టాన్ని ప్రభుత్వం చేయాలని, ఆదివాసీలకు ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్‌ను కల్పించే జిఒ 3ని పునరుద్ధరించాలని, గిరిజన స్పెషల్ డిఎస్‌సితో ఏజెన్సీలో టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య ఆధ్వర్యాన శుక్రవారం పాడేరులో చలో ఐటిడిఎ కార్యక్రమం చేపట్టారు. పలు ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలుత వారంతా ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ నుంచి ఐటిడిఎ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటిడిఎ ఎదుట బైఠాయించారు. వారినుద్దేశించి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ మాట్లాడుతూ షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగ నియామక చట్టం తేవడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించకుంటే చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని, మన్యం బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.ధర్మన్న పడాల్, నాయకులు కృష్ణారావు, లక్కు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, పాంగి జీవన్‌కృష్ణ, కార్తీక్, ఆదివాసీ మహిళా సంఘం నాయకురాలు హైమావతి, లత, జన విజ్ఞాన వేదిక నాయకులు జంపరంగి ఆనంద్, ఎఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, కృష్ణ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వంతాల నాగేశ్వరరావు, ఎఐవైఎఫ్ నాయకులు లక్ష్మణరావు, చంటి, ఎఐటియుసి నాయకులు అమర్, రాజబాబు, ఆదివాసీ సేన నాయకులు రాజబాబు, మాతృభాష విద్యా వాలంటీర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొర్రా శ్రీను, మర్రి చిట్టిబాబు, పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

మాతా శిశు మరణాల నివారణకు చర్యలు

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం ఆదేశం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని మాతా, శిశు మరణాలు సంభవించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించే బాధ్యత సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులపై ఉందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి సింహాచలం మాట్లాడుతూ మాతా శిశు మరణాలు సంభవించకుండా ఎప్పటికప్పుడు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి సుఖ ప్రసవం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక్కో పిహెచ్‌సిల్లో ఎంత మందికి ప్రసవాలు చేస్తున్నదీ ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుఖ ప్రసవాలపైనా, గర్భం దాల్చినప్పటి నుండి తీసుకోవాల్సిన మంచి పౌష్టికాహారం గురించి గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎంహెచ్‌ఒ జి.శిరీష, ఏరియా ఆసుపత్రి ఆర్ఎం వెంకట ఇందిరా, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ టి శేషారెడ్డి, డాక్టర్ ఆదిలక్ష్మి, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సంబంధించిన వైద్యాధికారులు, సూపర్ వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-అరకులోయ : జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు అరకులోయ క్రీడా పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. 68వ ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 3,4,5 తేదీల్లో జోగంపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల స్కూల్లో జరిగాయి. ఈ ఆర్చరీ పోటీల్లో అరకు క్రీడా పాఠశాల నుంచి ఐదుగురు క్రీడాకారులు అండర్ 14, అండర్ 17 పాల్గొనగా, వీరిలో ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి పోటీకి ఎంపికయ్యారు. అండర్ 14 లో ఇండియన్ రౌండ్ వి.సాయి తేజ (ఆరో తరగతి) బ్రాంచ్ మోడల్ సాధించారు. అండర్ 17 విభాగంలో జయప్రసాద్ (పదో తరగతి) ఇండియన్ రౌండ్ మోడల్, డి.గుత్తం బుద్ధదేవ్ రీకర్వ బ్రాంచ్ మోడల్ సాధించారు. వీరు ఈనెల 15 నుంచి గుజరాత్‌లోని నడియాడ్ జంక్షన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరిగే పోటీల్లో పాల్గొంటారని అరకులోయ స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ పిఎస్ఎన్ మూర్తి, కోచ్ లకే సూరిబాబులు తెలిపారు.

విజయ్యార్థులతో ప్రిన్సిపల్ మూర్తి, కోచ్‌లు

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

26న మహాధర్నాను జయప్రదం చేయండి

-సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న పాడేరు కలెక్టరేట్ ఆఫీస్ వద్ద జరిగే మహాధర్నాలో కార్మికులు, కర్షకులు, పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు.ఈ మేరకు శుక్రవారం అరకులోయలో ఆదివాసి గిరిజన సంఘం భవనంలో భవన నిర్మాణ రంగం,పెయింటర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు.
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కార్మికులకు, అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధించాలన్నారు. కనీస వేతనం 26000 కార్మికులకు చెల్లించాలని, గిరిజన రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ మహా ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్మికులు, గిరిజన రైతులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో తేజవలి పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొండలరావు, గోపి, రాజేంద్ర పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది తహసీల్దార్, మండల పరిషత్తు కార్యాలయ సిబ్బందికి శుక్రవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆ సంఘం నాయకులు జగదీష్, రాకేష్ మాట్లాడారు. 104లో ఉద్యోగులుగా ఉంటూ గిరిజన ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం అరబిందో యాజమన్యంకు అప్పగించడంతో ఇబ్బందులు పడ్డామన్నారు. ఇప్పటికి మూడు నెలలుగా వేతనాలు లేక కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 104 సర్వీసులను ప్రభుత్వం ఆధీనంలో తీసుకుని పీహెచ్సీల ద్వారా నిర్వహించాలన్నారు. అరబిందో యాజమన్యం చెల్లించాల్సిన మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలి

- కలెక్టర్‌కు గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు వినతి

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలంలో 16 పంచాయతీల్లో 2021 నుండి 2024 వరకు 13, 14, 15 ఆర్థిక సంఘాల నిధులు, జనరల్ ఫండ్స్ నిధులు దుర్వినియోగమయ్యాయని, వాటిపై సమగ్రమైన విచారణ జరపాలని సిపిఎం గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాడేరు ఐటిడిఎలో శుక్రవారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంపీపీ బోయిని కుమారి కలసి ఇష్టా రాజ్యంగా వ్యవహరించి పనులు చేయకుండా నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. జీకే వీధి మండల పరిషత్తు సమావేశంలో నిధులుపై నిలదీయగా, ఎంపీడీవో, ఎంపీపీ సరైన సమాధానం చెప్పలేదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రత్యేకాధికారితో విచారం జరిపి నిధులు దుర్వినియోగం పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పంచాయితీల్లో నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఎంపీటీసీ బుజ్జిబాబు కోరారు.

పాడేరు ఐటిడిఎ ఆఫీసు వద్ద వినతిపత్రం చూపుతున్న బుజ్జిబాబు

సిపిఎం మండల కార్యదర్శిగా పోతురాజు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: సిపిఎం మండల కార్యదర్శిగా ఎస్‌బి పోతురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో జరిగిన 8వ మహాసభలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కే సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పలనరస జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. ఇందులో మండల కార్యదర్శిగా ఎస్‌బి పోతురాజును రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా టి సూర్యనారాయణ, పి.సురేష్ కుమార్, పి సత్యనారాయణ, పి మత్తు, వి సింహాచలం, జి మహేశ్వరావు, ఏం.రామచందర్, కే.రామకృష్ణ, ఎస్ గురుమిసింగ్, బి.కోటిబాబు, పి.అచ్చమ్మను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల కార్యదర్శి మాట్లాడుతూ మండలంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

సోలార్ కుంభకోణంపై విచారణ చేపట్టాలి

జెడ్‌పిటిసిలు బాలయ్య, నూకరాజు

ప్రజాశక్తి - చింతపల్లి: మన్యంలో జరిగిన సోలార్ కుంభకోణానికి పాల్పడిన వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని చింతపల్లి, కొయ్యూరు జడ్పిటిసి సభ్యులు పోతురాజు బాలయ్య, వారా నూకరాజు లు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ, చింతపల్లి, జికె వీది, కొయ్యూరు మండలాల్లోని మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంటులోని బ్యాటరీలు, సోలార్ ప్లేట్స్ కాజేసిన కుంభకోణం వాస్తవమైతే ఆ కుంభకోణంలో కొంతమంది వైకాపా నాయకుల ప్రమేయం ఉందనడం సరికాదన్నారు. కుంభకోణానికి పాల్పడిన వైకాపా నాయకులు ఎవరో వారి పేర్లు బట్టబయలు చేయవలసిన అవసరం ఆరోపణలు చేసిన వారిపై ఉందన్నారు. ఆరోపణలు నిజమైతే అటువంటి వారిపై తమ పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుదన్నారు.వీటిని అక్రమార్కులు కాజేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మన్యంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులను కలిసి ఫిర్యాదు చేయడంతో పాటు, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసిలు

ఆశా కార్యకర్త పద్మజ మృతి

ప్రజాశక్తి-హుకుంపేట:- మండలంలోని గత్తుం పంచాయతీ కిమిడిపుట్టు గ్రామానికి చెందిన ఆశాకార్యకర్త డుంబేరి పద్మజ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో భర్త చనిపోవడం కుటుంబ పెద్ద దిక్కుగా ఉన్న మరణించడంతో కుటుంబ సభ్యుల్లో విషాదం నెలకొంది.సిఐటియు మండల నేతలు టి.పాలకొండ పడాల్, ఆదివాసి గిరిజన మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ హైమావతి సంతాపాన్ని ప్రకటించారు.

రాజమండ్రి డ్వామా పీడీ ముఖలింగంపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మట్ల వాణిశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

మద్యం షాపుల సిండికేట్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న రాజమండ్రి డ్వామా పీడీ ముఖలింగం, మరికొంత మంది ప్రభుత్వాధికారులపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మట్ల వాణిశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉన్న ఏడు మండలాల్లో మద్యం షాపుల సిండికేట్‌లో గ్రూపు-2 అధికారి అయిన ముఖలింగం, మరికొంత మంది అధికారులు ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో కీలకంగా వ్యవహరించి ప్రమోషన్ పొందిన ఆయన, ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వంలో రంపచోడవరం కేంద్రంగా మద్యం షాపుల డాన్‌గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ముఖలింగంతో పాటు ఈ మద్యం షాపుల సిండికేట్ వ్యవహారంలో సంబంధం ఉన్న ఇతర ప్రభుత్వ అధికారులపై విచారణ చేసి వెంటనే సస్పెండ్ చేయాలని, గిరిజన చట్టాల ఉల్లంఘించినందుకు పీసా చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వారి ఆర్థిక వ్యవహారాలపై విజిలెన్స్ ఎంక్వైరీ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని రామారావు, వాణిశ్రీ స్పష్టం చేశారు.

గిరిజనుల భూములను ఆక్రమించిన

గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండలం మద్దులూరు, సున్నంపాడు గ్రామానికి చెందిన కంగల వెంకటేశ్వరరావు, కత్తుల సోమిరెడ్డి, చెదల అబ్బాయి రెడ్డి తదితరుల భూమిని ఆక్రమించి నకిలీ ధ్రువపత్రాలు సృష్టించిన 'ద సన్' డైరెక్టర్ అక్కిస బాలకృష్ణ అలియాస్ బాలుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు ఆదివాసీ సంఘాల నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అమాయక గిరిజనులకు మద్యం ఎరచూపి భూమి లీజుకు ఇస్తే ప్రతిఏటా ఎకరానికి రూ.1000 చొప్పున రూ.10వేలు ఇస్తామని ఆశ పెట్టి డాక్యుమెంట్లు తీసుకొని వేరొక ఆదివాసీ బినామీ పేరు మీద ఆ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి ఆదివాసీలకు మధ్య గొడవ పెట్టారని తెలిపారు. తనకు అనుకూలంగా ఉండే మహాదేవ్ అనే హైకోర్టు అడ్వకేట్ ద్వారా కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. భూములు బదలాయింపు చేయకపోతే మానవ హక్కుల ద్వారా ఆర్టీఐ ద్వారా సమాచారాన్ని తీసుకొని తప్పుడు కేసులు బనాయిస్తామని రెవెన్యూ, పోలీస్ అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని పేర్కొన్నారు. భూమి గల రైతులపై గంజాయి, మద్యం లాంటి తప్పుడు కేసులు అక్రమంగా పెట్టిస్తూ అమాయక ఆదివాసీలను మోసగిస్తున్నారని తెలిపారు. వైసిపి నేతలు మాజీ మంత్రి కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అండదండలతో ఇదంతా చేస్తున్నారని, తక్షణమే బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మల్లి భాస్కర్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లాల రాజ్‌కుమార్ రెడ్డి, ఆదివాసీ సంఘాల నాయకులు లోసు భూషణరావు, హైకోర్టు అడ్వకేట్ గునావత్ ప్రదీప్ నాయక్, ఎ.సుదర్శన్‌రావు, బి.షణ్ముఖ, బాధితులు పాల్గొన్నారు.

మంత్రికి సమస్యను తెలియజేస్తున్న బాధితులు, వివిధ సంఘాల నేతలు

ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువలో పూడిక తీయాలి

ప్రజాశక్తి-దేవీపట్నం

మండలంలోని ఇందుకూరు గ్రామపంచాయతీ పరిధి చిన్నభీంపల్లి గ్రామంలో ఎర్ర చెరువు నుండి ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువలో తక్షణమే పూడికతీత పనులు చేపట్టాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన, గిరిజనేతర రైతులు సార్వా, దాల్వా పంటలకు సక్రమంగా సాగునీరు అందించాలంటే ఎర్ర చెరువు నుండి శరభవరం పంచాయతీ పరిధిలో ఉన్న ఎస్.రామన్నపాలెం గ్రామం వరకు ఈ కాలువలో పూడి తీయాల్సి ఉందని పేర్కొన్నారు. పూడిక తీయకపోతే ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువకు గండిపడే ప్రమాదముందన్నారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవీంద్ర

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-సీలేరు

విద్యార్థులు గంజాయి, గుట్కా ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఉత్తమమైన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీలేరు ఎస్సై కే.రవీంద్ర పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్ పూర్తి చేసిన తరువాత ఏ ఉద్యోగంలో స్థిరపడాలో ముందుగానే నిర్దేశించుకొని విద్యలో కఠోర సాధన చేయాలని సూచించారు. తన తల్లిదండ్రులు నిరుపేద కుటుంబానికి చెందిన వారిని వ్యవసాయం కూలి పనులు చేసి తనను చదివించారని, ప్రణాళిక బద్ధంగా చదవి ఎస్ఐ ఉద్యోగం పొందానని చెప్పారు. సైబర్ నేరగాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్లలో ఫేక్ కాల్స్ ఓటీపీలు చెప్పమని వస్తుంటాయని, వాటి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా వ్యవహరించకపోతే బ్యాంక్ ఖాతాలో డబ్బులు స్వాహా చేస్తారని సూచించారు. విద్యార్థులు సెల్ ఫోన్‌కు ఎడిట్ కాకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.శంకరరావు, ఎన్ఎస్ఎస్ పిఒ డి.శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం

రాజమహంద్రవరం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యాన రంపచోడవరం మండలం, సిరిగిందలపాడు గ్రామంలోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అవరణలో ఈ నెల 10న ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి స్వామి పరిజ్ఞేయనంద మహారాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ వారిచే కంటి వైద్య శిబిరం కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కంటి ఆపరేషన్లు నిమిత్తం వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు తీసుకుని రావాలని సూచించారు. డాక్టర్ గోపాలం శివన్నారాయణ బృందంచే ఫిట్స్ (మూర్ఛ) వైద్యశిబిరం నిర్వహిస్తామని, ఫిట్స్ రోగులకు నాలుగు నెలలకు సరిపడా మందులు ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-పాడేరు: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 142 వినతులు అందాయి. జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటిడిఏ పిఒ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డి.ఆర్.ఓ. కె.పద్మలత సంయుక్తంగా అర్జీదారుల నుండి 142 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి అధికారులు చొరవ చూపించాలన్నారు. నిర్ణీత కాల పరిమితిలో ఫిర్యాదులను పరిష్కారం చూపాలన్నారు.

పాడేరు మండలం తోటలమామిడి గ్రామస్తులు పొంగి నాగేశ్వరరావు, పాంగి కృష్ణారావు అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని వినతి పత్రాలను సమర్పించారు. పెదబయలు మండలం గంపరాయి పంచాయతీ చీడిపుట్టు గ్రామ ఎం.పి.పి పాఠశాలకు పక్కా భవనం, కిచెన్ షెడ్డు, మరుగు దొడ్ల నిర్మాణాలని వినతి పత్రంలో కోరారు. పెదబయలు మండలం జర్రిగెల గ్రామానికి చెందిన జె. కృష్ణారావు అల్లం, పెల్లి పేస్ట్ తయారీ యూనిట్ మంజూరు చేయాలని దరఖాస్తును అందజేసారు.చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ రేగళ్ళ గ్రామస్తుడు మర్రి శ్రీను చెక్ డ్యాం మరమ్మతులు చేపట్టి సాగునీటి సదుపాయం కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ముంచింగిపుట్టు మండలం కొర్రాయి సర్పంచ్ పూజారి కొమలు కొర్రాయి ప్రధాన రహదారిలో వంతెన నిర్మాణానికి 2021 శంకుస్థాపన చేసారని నేటికీ పనులు ప్రారంభించలేదని వంతెన నిర్మాణం పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్. బి.ఎస్.నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్‌రావు, సెరీ కల్చర్ ఎడి అప్పారావు, రహదారులు భవనాల శాఖ ఇ ఇ బాల సుందర బాబు, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇ డి.వేణు రాజు, కె. వేణు గోపాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా, ఎల్‌డిఎం నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జి ఉప సంచాలకులు ఎల్.రజని, ఎస్‌డిసి భవాని, ఐటిడిఏ పరిపాలనాధికారి ఎం.హేమలత, పిడి సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన విఓఎల ఆందోళనలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మూడేళ్ల కాల పరిమితిని విరమించుకోవాలని మండల కేంద్రంలో ఐకెపిలో పని చేస్తున్న వీఓఎలు చేపట్టిన రిలే దీక్షలు మూడో రోజు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి స్థానిక ఎంపీడీవో ప్రేమ్ సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. వీరి ఆందోళనకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సంపూర్ణ మద్దతును తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భాస్కరరావు, కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు వి.జమున, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ పి శాంత కుమారి, పిసిసి ప్రతినిధి పి చిన్నస్వామి పాల్గొన్నారు.

ముంచింగి పుట్టు: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద విఓఎలు దీక్ష నిర్వహించారు., మండల తహసిల్దార్ కార్యాలయ జంక్షన్ వరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆరు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని వివోఏలు దుకాణాల సముదాయాలలో భిక్షాటన చేశారు. అనంతరం నాలుగు రోడ్ల వద్ద మానవహారం ఏర్పడి కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వివోఏల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.

మండలంలో పర్యటించిన అరకు ఎమ్మెల్యే మత్స్య లింగం, ఎంపీ తనుజరాణా, జడ్పీ చైర్ పర్సన్ సుభద్రలు వివోఎల దీక్షా శిబిరానికి చేరి వారికి మద్దతు తెలిపారు. సమస్యలను విన్నవించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు.

జిమాడుగుల: మండల కేంద్రంలో రామాలయం నుంచి నౌర్మతి జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భగా వెలుగు. విఓఏల ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు మహేష్ మాట్లాడుతూ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో విఓఏల ఉద్యోగుల సంఘ మండల కార్య దర్శి దేవినాయుడు, ఆర్య, లక్ష్మణ్, చరణ్ పాల్గొన్నారు.

పెదబయలు :మండల కేంద్రంలో వివోఎల రిలే దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ, టిడిపి ప్రభుత్వం వివోఎలను తొలగించే యోచనను విరమించు కోవాలని డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు జంపరంగి సునీల్ కుమార్, వివోఎల మండల అధ్యక్ష, కార్యదర్శులు వరలక్ష్మి, వెంకటరత్నం, కోశాధికారి పి.కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ త్రినాథ్, జాయింట్ సెక్రెటరీ బోండా రాజు పాల్గొన్నారు.

అరకులోయ:అరకు లోయలో విఓఎలు సిఐటియు జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో

అరకు లోయలో భిక్షాటన చేస్తున్న విఓఎలు

భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సర్క్యులర్ ను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతినెల వేతనాలు క్రమం తప్పకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆరు నెలల వేతనాలు చెల్లించకపో వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

దేవీపట్నం : మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి ఉన్న వేతనాలను చెల్లించాలని, అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ దేవీపట్నం ఎంపీడీవో, వెలుగు ఏపిఎంకు శుక్రవారం వెలుగు విఓఎలు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్రంలో 28 వేల మంది వివోఏలు పొదుపు సంఘల మహిళలకు దీర్ఘకాలంగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. వివోఏ సంఘం మండల అధ్యక్షులు బి నరసింహులు, మండల కార్యదర్శి సిహెచ్ సుధా, ఎం సుబ్బలక్ష్మి, కె వెంకట దొర, నాయకులు, విఓఏలు పాల్గొన్నారు.

జి.మాడుగుల , పెదబయలులో విఓఎల నిరసన ప్రదర్శనలు

దేవీపట్నం, ముంచంగిపుట్టులలో వినతిపత్రాలు అందజేత

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన యుటిఎఫ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -అరకులోయరూరల్: అరకులోయ మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక ఆదివాసి గిరిజన సంఘం భవనంలో యూటీఎఫ్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు, గౌరవాధ్యక్షులు చిట్టిబాబు, దేముడు సమక్షంలో నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా ఎల్బీ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా తాంగుల విజయ్ రావు, గౌరవాధ్యక్షుడిగా గంగరాజు, ఉపాధ్యక్షుడిగా ఎం.నాగేశ్వరరావు, కోశాధికారిగా ఎస్ స్వామి, మండల కార్యదర్శిగా డి.రాజుబాబు ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా ఎల్బి కుమారి, వి.శాంతి కుమారి, ఎస్.రాజ్ కుమార్, బి.గోపాల్, కె శాంతి భూషణ్,ఎన్నికయ్యారు. వీరితో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా నారాయణ, ఎస్ రామచందర్, ఆడిట్ కమిటీ సభ్యుడుగా రమణ, కె శ్రీనివాసరావు, సుబ్బారావు ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో సిపిఎస్ కమిటీ సభ్యులు ఎల్బీ రవికుమార్, ఏ లచ్చన్న , మచ్చలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-చింతపల్లి: బాల్యవివాహాలను అరికట్టేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఎంఇఒ పనసల ప్రసాద్, ప్రాంతీయ ఆసుపత్రి సూపరిండెంట్ ప్రభావతి తెలిపారు. శుక్రవారం సిడిపిఒ జివి రమణి ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అంగన్వాడీలు, మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశం కిషోర్ బాలికల రక్షణ తదితర వాటిపై జాగ్రత్తలను వివరించారు. బాల్యవివాహాల అనర్థాలపై విద్యాలయాల్లోఅవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నాఉ. కార్యక్రమంలో అంగన్వాడి సిడిపిఒ రామలక్ష్మి, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విడివికె ఉత్పత్తుల హబ్‌లు ఏర్పాటు చేయండి

మాట్లాడుతున్న పిఒఅభిషేక్

ప్రజాశక్తి పాడేరు : వన్ దన్ వికాస్ కేంద్రాలు భవనాలకు మరమ్మత్తులు చేపట్టి 12 వీడివీకే హబ్ లు ఏర్పాటు చేయాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. శుక్రవారం ప్రాజెక్టు అధికారి క్యాంప్ కార్యాలయంలో ఐటీడీఏ అధికారులు, వెలుగు అధికారులతో వీడికే ఉత్పత్తులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతపండు, పసుపు, కొండ చీపుర్లు, కాఫీ, అడ్డాకులు తయారీ లను వీడివికే కేంద్రాల ద్వారా విక్రయాలు చేపట్టాలని ఆదేశించారు. పాడేరు డివిజన్లో ఏర్పాటు చేసిన వీడివికేలలో గిరిజన ఉత్పత్తులను ప్రారంభించాలని పేర్కొన్నారు. ముందుగా పది విడివికే భవనాలను మనమత్తులు చేసి విడివికే హబ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మంజూరు చేసిన 106 వన్ దన్ వికాస్ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.వందన్ వికాస్ కేంద్రాలను అభివృద్ధి చేసి గిరిజన మహిళలకు ఆర్థిక చేయూత అందించాలన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకర్‌రావు, ఎం .వెంకటేశ్వరరావు, డి ఆర్ డి ఏ పి డి వి.మురళి, వెలుగు ఏపీఎంలు వి.ఎస్. ప్రసాద్, సిబ్బంది శంకర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శిథిల విద్యుత్ స్తంభాలను పట్టించుకోరా.?

ప్రజాశక్తి -అనంతగిరి:విద్యుత్ స్తంభాల మరమ్మతుపై పిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని టోకురు సర్పంచ్ కిల్లో. మొస్య విమర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామస్తులతో కలిసి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను పరిశీలించారు.అనంతరం అయన మాట్లాడుతూ, పెంపుడువలస గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు మరమ్మతులు చేయాలని ఎనిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అనుకుని ఉన్న స్తంభాలు పిల్లల పై పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణరావు, మద్దు, శ్రీను తదితరులు పాల్గొన్నారు

పాడైన విద్యుత్ స్తంభాన్ని చూపుతున్న మొస్య

ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

చట్రాపల్లి బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండలం చట్రాపల్లిలో సెప్టెంబర్ 8న కొండ చరియలు విరిగిపడి సర్వం కోల్పోయిన బాధితులకు హుకుంపేట మండలం బాకూరి కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు రూ.12,500 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులు, బట్టలతో పాటు నగదు రూపంలోనూ అందజేశారు. కొండచరియలు, పేరుకుపోయిన మట్టి దెబ్బలు, చెత్త చెదారాలు నేటికీ తొలగించకపోవడంపై ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చట్రాపల్లి నెలకొన్న మట్టి చెత్తాచెదారాలను తొలగించాలని, బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాపూరి కోటి, రేగం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి-చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో క్యాన్సర్ వ్యాధి గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల భారతదేశంలో స్త్రీ, పురుషులలో ఊపిరితిత్తుల క్యాన్సర్, వక్షోజ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ ఎక్కువగా వ్యాపిస్తుందని తెలిపారు. దీనిపై అవగాహన పెంపొందించుకుంటే క్యాన్సర్ వ్యాధి వ్యాప్తిని తగ్గించుకోగలమని చెప్పారు. ముఖ్యంగా డ్రగ్స్, మత్తు పదార్థాలు, మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.సాయికుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిలో రెండు రకాల వ్యాధులు ఉంటాయని, అవి కణితి రూపంలో, రక్తంలో మలినమై శరీరమంతా వ్యాపించి దద్దుర్ల రావడం, తల వెంట్రుకలు ఊడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయని, ఈ వ్యాధి సోకిన వారికి నాలుగవ దశలో ప్రాణహాని కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి.వెంకట్రావు, ఆర్‌సిహెచ్.నాగేశ్వరరావు, డాక్టర్ వై.పద్మ, ఎస్.అప్పనమ్మ, జి.హారతి, కె.శైలజ, కె.శ్రీలక్ష్మి, కె.శ్రీదేవి, ఆర్.మౌనిక, పి.అలివేలు, ఎన్.రమేష్, బి.శ్రీనివాసరావు, సుభద్ర, ఎస్.మూర్తి, వి.శీనయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జాయ్ జమీమా కేసులో మరో బాధితుడు

- కేసు నమోదు చేసిన ఎంవిపి పోలీసులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో సంచలనం సృష్టించిన జాయ్ జమీమా కేసులో మరో బాధితుడు వెలుగులోకి వచ్చాడు. జాయ్ జమీమా వేణు రెడ్డి అనే యువకునితో కలిసి తనను మోసం చేసిందని శుక్రవారం ఎంవిపి కాలనీ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు నమోదైంది. ఆ ప్రకారం.. 2019లో ఉద్యోగం నిమిత్తం విశాఖ నగరంలో నివాసం ఉన్న బాధితునికి తన ఆఫీసులో పనిచేసే కె.జాయ్ జమీమాతో పరిచయం ఏర్పడింది. అనంతరం ఆమె స్నేహితుడు వేణు రెడ్డిని పరిచయం చేసింది. వారిరువురూ తన వద్ద రెండు సెల్ ఫోన్లు దొంగిలించి మరొక వ్యక్తి ద్వారా డబ్బులు వసూలు చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అంతేకాకుండా వీరిరువురూ కలిసి బుల్లయ్య కాలేజ్ సమీపంలో ఒక ఇంట్లో తనను నిర్బంధించి మత్తు పదార్థాలు తీసుకోవాలని బలవంతం చేసినట్టు తెలిపాడు. ఆ సమయంలో జమీమా తనను చంపేందుకు కూడా ప్రయత్నించిందని, డెబిట్ కార్డు ద్వారా రూ.1,50,000 నుంచి రూ.2 లక్షల వరకూ దోపిడీకి పాల్పడ్డారని పేర్కొన్నాడు. శారీరకంగా, మానసికంగా వేధింపులకు నిత్యం గురిచేశారని వాపోయాడు. ఇదిలా ఉండగా జాయ్ జమీమా, ఆమె స్నేహితుడు వేణు రెడ్డిపై ఇప్పటికే భీమిలి, కంచరపాలెం, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లలో పలు కేసులు నమోదయ్యాయి.

13న నీటి సంఘాల ఓటర్ల తుది జాబితా

10 వరకూ నమోదు ప్రక్రియ
ఉమ్మడి విశాఖ జిల్లాలో 360 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో నీటి వినియోగదారుల సంఘ ఎన్నికల ఓటర్ల తుది జాబితా ఈ నెల 13న విడుదల కానుంది. పది వరకు ఓటర్ల నమోదు కొనసాగనుంది. ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి 13న తుది జాబితాను అధికారులు విడుదల చేయనున్నారు. నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించిన ఓటర్ల నమోదు రెవెన్యూ యంత్రాంగం చేస్తోంది. రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఆయకట్టుదారుల వివరాలను సరిచూసుకొని ఓటర్ల నమోదు చేస్తున్నారు. 2015లో సాగునీటి సంఘ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల నాటి ఓటర్ల జాబితాను తాజా పర్చే క్రమంలో చనిపోయిన, భూమి విక్రయించిన వారి పేర్లను తొలగించి, రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ స్థానంలో ప్రస్తుత ఆయకట్టుదారుడిని ఓటరుగా నమోదు చేస్తున్నారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మేజర్, మధ్య తరహా, చిన్న తరహా నీటిపారుదల వనరుల కింద 2,13,426 ఎకరాల విస్తీర్ణం సాగవుతోంది. ఈ ఆయకట్టు పరిధిలో 360 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆయకట్టుదారులు సుమారు మూడు లక్షల మంది వుంటారని అంచనా. అయితే తుది ఓటర్ల జాబితా విడుదలైతే ఓటర్ల సంఖ్యపై స్పష్టత రానుంది. 2015 తరువాత ఎన్నికలు నిర్వహించకపోవడంతో రాబోయే ఎన్నికలకు ఓటర్ల నమోదుపై రెవెన్యూ సిబ్బంది కసరత్తు ఎక్కువ చేయాల్సివస్తోంది. అనకాపల్లి జిల్లాలోని తాండవ, రైవాడ, కోనాం, పెద్దేరు ప్రాజెక్టుల్లో ఒక ప్రాజెక్టు కమిటీ చొప్పున నాలుగు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. తాండవకు ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 27 నీటి వినియోగదారుల సంఘాలు, 324 ప్రాదేశిక సభ్యులకు ఎన్నికలు జరగనున్నాయి. రైవాడ ప్రాజెక్టుకు 10 నీటి వినియోగదారుల సంఘాలు, 120 ప్రాదేశిక సభ్యులు, కోనాంకు ఎనిమిది నీటి వినియోగదారుల సంఘాలు, 96 ప్రాదేశిక సభ్యులు, పెద్దేరుకు 10 నీటి వినియోగదారుల సంఘాలు, 116 ప్రాదేశిక సభ్యులకు ఎన్నికలు జరగనున్నాయి.

విశాఖపట్నం జిల్లాలో చిన్నతరహా నీటిపారుదల వనరుల కింద 29 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 174 ప్రాదేశిక సభ్యులు, పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో చిన్న తరహా నీటి పారుదల వనరుల కింద 28 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 168 ప్రాదేశిక సభ్యులకు ఎన్నిక జరగనుంది.

మాట్లాడుతున్న ఎపిఒ మణికుమారి

ఉపాధి హామీ పనులకు వెళ్లకుంటే జాబ్ కార్డు రద్దు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులకు వెళ్లకుంటే జాబ్ కార్డును రద్దు చేయనున్నట్లు ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ మణికుమారి తెలిపారు. మండలంలోని పూజారికి గ్రామంలో రైతులకు ఉపాధి హామీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాబ్ కార్డును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో తుప్పలు లేకుండా, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రబ్బర్ మొక్కల పెంపకం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ చిన్నమ్మి, ఫీల్డ్ అసిస్టెంట్ బేబీ రాణి, బిఎఫ్టి మొనర్జి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు ఆదివాసీ గిరిజన ఉద్యోగ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-రంపచోడవరం : ఆదివాసీ గిరిజన ఉద్యోగ సంక్షేమ సంఘం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా శాశ్వత కార్యవర్గం ఎన్నిక సమావేశం ఈ నెల 10న ఆదివారం రంపచోడవరంలోని ఆదివాసీ గిరిజన భవన్ నిర్మాణ స్థలంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం తాత్కాలిక జిల్లా కమిటీ సభ్యులు కత్తుల ఆదిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కార్యవర్గం ఎన్నిక సమావేశానికి గిరిజన ఉద్యోగులు తప్పకుండా హాజరై తమ సూచనలు అందించాలని కోరారు. గిరిజన సంక్షేమం కోసం పాటుపడే సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.కృష్ణ, కె.వెంకన్న దొర, కె.రాంబాబు, టి.రాజబాబు, జి.సత్యనారాయణ, వి.కృష్ణారావు, ఎ.రాంబాబు, కె.ఫకీర్ దొర పాల్గొన్నారు.

ఆదివాసీ కమ్యూనిటీ భవనానికి స్థలం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-దేవీపట్నం : ఆదివాసీ కమ్యూనిటీ భవనానికి 5 సెంట్లు స్థలం ఇవ్వాలని కోరుతూ దేవీపట్నం తహశీల్దారు కె.సత్యనారాయణకు వినతిపత్రం ఇచ్చినట్లు ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు. మండలంలోని ఇందుకూరుపేట గ్రామంలో స్త్రీశక్తి భవనం పక్కనున్న 5 సెంట్లు గ్రామ కంఠం భూమిని కేటాయించాలని కోరారు. దీనికి తహశీల్దారు సత్యనారాయణ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆదివాసి జేఏసీ నాయకులు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్న దొర పాల్గొన్నారు.

జస్వంత్‌కు రాజ్య పురస్కార్ ప్రదానం

రాజ్య పురస్కార్ సర్టిఫికెట్ అందుకుంటున్న జస్వంత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ నజీర్ స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులకు రాజ్య పురస్కార్ సర్టిఫికెట్లు ప్రదానం చేయగా కంచరపాలెంనకు చెందిన శ్రీ విద్యా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి జస్వంత్ సూర్య ఆ సర్టిఫికెట్‌ను అందుకున్నాడు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖాధికారి, జిల్లా చీఫ్ కమిషనర్ ఎన్.ప్రేమకుమార్ రాజ్య పురస్కార్ అందుకున్న జస్వంత్ సూర్యను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్లను ప్రతి పాఠశాలలో ప్రారంభించాలన్నారు. రాష్ట్ర యువజన విభాగం చైర్‌పర్సన్ మారుతి హరీష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం మీద 10 మంది స్కౌట్ విద్యార్థులకు రాజ్యపురస్కార్ అవార్డులు ఇచ్చారని, అందులో విశాఖపట్నం జిల్లా తరుపున జస్వంత్ సూర్యకు అవార్డు రావడం గర్వకారణమని అన్నారు. జిల్లా కార్యదర్శి దాసరి వేణుగోపాల్ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలను దశ దిశలా విస్తరింపజేయాలని, విద్యార్థులు స్కౌట్‌లో చేరడం వల్ల క్రమశిక్షణ వస్తుందని అన్నారు.

డిఎస్‌సి ఉచిత కోచింగ్ ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష వాయిదా

ప్రజాశక్తి-రంపచోడవరం : ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ డీఎస్సీ కోచింగ్‌కు ఎంపిక చేయడానికి కాకినాడ జిల్లా సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఈ నెల 10న జరగాల్సిన ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్షను వాయిదా వేసినట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచారకులు ఎం విజయశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వ ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో దీనిని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తరువాత ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని తెలిపారు. రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ పరిధిలోని అభ్యర్థులు పరీక్ష వాయిదాను గమనించాలని కోరారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

గిరిజనోద్యమ నేత బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని మండలంలోని దోనెలపాలెం గ్రామంలో శుక్రవారం వాలీబాల్ టోర్నమెంట్‌ను స్థానిక సర్పంచ్ సవిరాల చంద్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షులు తాము సూరిబాబు మాట్లాడుతూ శుక్రవారం నుండి మూడు రోజుల పాటు వాలీబాల్ టోర్నమెంట్ జరుగుతుందని, ఈ నెల 12న విజేతలకు బహుమతుల ప్రదానం ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చలుమూర్తి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ మైలుబోయిన వెంకటరమణ, సిహెచ్ విశ్వనాథం, ఈక చిన్నాలదొర తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాలలో నిర్వహించనున్నట్లు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సిహెచ్ వెంకటరావు మీడియాకు తెలిపారు. వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేయనున్నట్టు వెల్లడించారు.